క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో సంధ్యారాణి

గార: మండలంలోని కొర్ని పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో సీహెచ్ సంధ్యారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట నీటి కుంట తవ్వకాలకు రైతులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వచ్చే ఏడాది నుంచి శ్రమశక్తి సంఘాల ద్వారా మాత్రమే పనులు జరుగుతాయని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేస్తే, అనేక రకాల మొక్కలు పెంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేఈ నారంనాయుడు, టీఏ బి.సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ మళ్ల కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో పద్మావతి

గార: మండలంలోని అంపోలు పరిధి చల్లపేట రైతుసేవా కేంద్రం వద్ద విశిష్ట సంఖ్య గుర్తింపు కార్డుపై రైతులకు వ్యవసాయాధికారి డి.పద్మావతి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్డు వ్యవసాయ, అనుబంధ రంగాలకు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రైతులకు రానున్న కాలంలో విశిష్ట సంఖ్య తప్పనిసరి కాబోతుందన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని సూచించారు.

ఆధార్ కేంద్రాలు వినియోగించుకోవాలి



ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

గార: ప్రజలంతా ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి సూచించారు. గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం జరిగిన ఆధార్ క్యాంపును పరిశీలించారు. మార్చి మూడో వారంలో జరగనున్న ఆధార్ క్యాంపును మిగిలిన ఆధార్ లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాము తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలో కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీచక్రాల వద్ద జరిగిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెట్లను తొలగించండి



ఇళ్లముందు ఉన్న చెట్లు

ఎచ్చెర్ల: మండలంలో చిలకపాలేం గ్రామంలోని పొందూరు రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని వికలాంగుల కాలనీ ప్రజలు కోరుతున్నారు. రహదారికి ఇరువైపులా నివాసముంటున్న ప్రజలంతా ఈ చెట్లు వలన ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇక్కడ ఇళ్లముందు పెద్దపెద్ద చెట్లు ఉండడం వలన ఇంటికి ఇబ్బందులు ఉంటున్నాయని, వేర్లు నాటుకుపోయి గోడలు బీటలు వారుతున్నాయని చెబుతున్నారు. అలాగే చెట్ల ఊడలు ఇళ్లపై పడి పెంకులు పగిలిపోవడం జరుగుతోందన్నారు. ఈ విషయంపై ఆర్అండ్బీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లక్ష్యం మేరకు ఉపాధి పనులు



పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు అన్నారు. చిలకపాలేంలో నిర్మించిన ఫారం పాంట్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా విడిచి పెట్టకుండా డిజైన్ మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి వేతనదారులు గరిష్ఠ వేతనం పొందేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం శోభాదేవి పాల్గొన్నారు.

బెల్టు జోరు.. పల్లె బేజారు..!



- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యం
- కుదేలవుతున్న కుటుంబాలు



పోలీసులు పట్టుకున్న బెల్టుషాపులో అక్రమ మద్యం (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వంలో పల్లెలు మద్యం మత్తులో చిక్కుకుంటున్నాయి. ఊరూ వాడా మద్యం ఏరులై పారుతోంది. బెల్టు షాపుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఉదయం 6 గంటల నుంచే మద్యం దొరుకుతుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. బెల్టు షాపులు పెడితే చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం మండలంలోని 32 పంచాయతీల్లో 10, లావేరు మండలంలో 33 పంచాయతీల్లో 5, ఎచ్చెర్ల మండలంలో 28 పంచాయతీల్లో 6, జి.సిగడాం మండలంలో 31 పంచాయతీల్లో 5 మద్యం షాపులు అధికారికంగా ఉన్నాయి. ఈ మద్యం షాపులకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించి, లక్షల్లో ఆదాయం పొందింది. అనంతరం లాటరీ ద్వారా ఎంపిక చేశారు.



మద్యం సిండికేట్

లాటరీ అనంతరం మద్యం షాపులు సిండికేట్‌గా ఏర్పడి అనతి కాలంలోనే గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నాయి. నేరుగా వైన్ షాపులు నుంచి మద్యం సరఫరా సాగుతోంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాధారణంగా వైన్ షాపులు తెరిచి ఉంటాయి. అయితే బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల్లో విక్రయాలకు రూ.లక్షల్లో వేలంపాటలు నిర్వహిస్తున్నారు. వేలంపాట లేనిచోట గ్రామాల్లో 5 నుంచి కనీసం 10 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీసుల దాడులు అరకొరగా జరుగుతున్నాయి. ఆదాయమే లక్ష్యంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర పండగలు వంటివి జరిగితే నిరంతరం ఆయా గ్రామాల్లో మద్యం సరఫరా జరుగుతోంది. బెల్టు షాపుల్లో క్వార్టర్‌కు అధికంగా రూ.20 నుంచి రూ.30ల వరకూ వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో బెల్టుషాపుల విస్తరణపై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మాఫియా విస్తరిస్తోంది



గ్రామాల్లో మద్యం మాఫియా విస్తరిస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండడం వలన అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా మద్యం అమ్మకాలు ఉండేవి. ప్రస్తుతం గ్రామాల్లో రోజురోజుకూ బెల్టు షాపులు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించడం లేదు. ప్రజాప్రయోజనాల కోసం బెల్టు షాపులు నియంత్రించాలి.

– బల్లాడ హేమమాలినీ రెడ్డి, జెడ్పీటీసీ, ఎచ్చెర్ల

ఆరోగ్యం దెబ్బతింటుంది



బెల్టు షాపుల్లో వేకువజాము నుంచే ప్రస్తుతం మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మద్యం ప్రియుల ఆరోగ్యం దెబ్బతింటుంది. మరోపక్క చాలా మందికి మద్యం వ్యసనంగా మారుతోంది. సరఫరాపై నియంత్రణ ఉండాలి. లేదంటే చాలా పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బంది పడతాయి.

– సనపల ఇందిర, మాజీ సర్పంచ్, ఇబ్రహింబాద్

ఆదాయమే లక్ష్యంగా అమ్మకాలు



ప్రస్తుతం ఆదాయమే లక్ష్యంగా మద్యం వ్యాపారం జరుగుతోంది. ప్రజాప్రయోజనాలకు ఎటువంటి ప్రాధాన్యమివ్వడం లేదు. మద్యం వలన గ్రామాల్లో పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. కుటుంబ కలహాలతో పాటు శాంతి భద్రతలకు సైతం సమస్యగా మారే అవకాశం ఉంది. బెల్టు షాపుల నియంత్రణపై అధికారులు దృష్టిపెట్టాలి.

– నేతింటి యమున, సర్పంచ్, పొన్నాడ

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అకాడమీ సభ్యులు



కమలాదీప్తి గాత్ర కచేరి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారులు కస్తూరి కమలాదీప్తి చే త్యాగరాజస్వామి కీర్తనల గాత్ర సంగీత కచేరి వీనులవిందుగా సాగింది. వీరికి వయలిన్‌పై మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై ఆకాశవాణి నిలయ విద్వాంసులు కొమ్మాజ్యోస్యుల సద్గురు చరణ్, ఘటంపై ఆకాశవాణి దూరదర్శన్ కళాకారులు మావుడూరు సూర్యప్రసాదరావులు వాద్య సహకారం అందించారు. ముందుగా స్థానిక కళాకారులచే ప్రదర్శన జరిగింది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పి.మాలతి, డాక్టర్ కె.అమ్మన్నాయుడు, అధ్యక్షుడు వేంకటేశ్వరరావు, ఎల్.రామలింగస్వామి, బీపీ మోహనరావు, లక్ష్మీగణపతి శర్మ, కేఎల్ఎన్ మూర్తి, మార్గదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన విద్యావిధానం అవసరం



మాట్లాడుతున్న అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ధర్మారావు

శ్రీకాకుళం కల్చరల్: రాజకీయ విధానాలతో సంబంధం లేకుండా ప్రభుత్వాలకు బలమైన విద్యావిధానం ఉండాలని అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు నల్లి ధర్మారావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఇస్కాఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాషలో ఉన్న మాధుర్యం మరో భాషలో ఉండదన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు, ఇస్కాఫ్ అధ్యక్షుడు ఎంవీ మల్లేశ్వరరావు, కార్యదర్శి జీవీ నాగభూషణరావు, ఎస్.ఈశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు ఆదిత్య, ఎస్.మురళీకృష్ణ, పురుషోత్తం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జాయి కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ జామి స్రవంతి ఆధ్వర్యంలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం చిన్నారులకు మాతృభాషలో పద్యాలు, కథల్లో గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షమెన్నడో..!



చీడిపేటకు వెళ్లే మట్టి రోడ్డు

గార: మండలంలోని చీడిపేటకు వెళ్లే రహదారికి మోక్షమెన్నడు కలుగుతుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. గ్రామానికి ఇప్పటివరకు సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 15 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా మట్టిరోడ్డే దిక్కుగా ఉంది. దీనిపై కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లే పరిస్థితి లేదు. ఏదైనా అర్ధరాత్రి వేళలో ప్రమాదం సంభవిస్తే అంబులెన్స్ కోసం రెండు కిలోమీటర్లు నడుచుకొని వెళ్లాల్సి వస్తోంది. అందువలన అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రాస్తులు కోరుతున్నారు.

మధురమైనది మాతృభాష



జి.సిగడాం: తెలుగు భాషా పండితుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులతో తెరవే సభ్యులు



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర



శ్రీకాకుళం న్యూకాలనీ: తెలుగుతల్లి వేషధారణలో ఉన్న విద్యార్థినితో ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: తేనెలాంటి మధురమైనది మాతృభాష అని శ్రీకాకుళం హయాతినగరంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రపంచంలోకెల్లా తెలుగు భాష ఎంతో విశిష్టత కలిగినదని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. కళాశాల తెలుగు విభాగం విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ లావేరు తెలుగు అధ్యాపకుడు బాడాన శ్యామలరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డాక్టర్ కె.గిరిజ, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష విశిష్టత గురించి వ్యాసరచన పోటీలు చేపట్టారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాష గొప్పదనాన్ని వివరించారు. విశ్రాంత సీఈవో సురంగి మోహనరావు మాట్లాడుతూ మాతృభాషలోనే అందరూ మాట్లాడాలని కోరారు. అనంతరం తెరవే కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో సభ్యులు చాడ శ్రీనివాసరావు, లింగరాజు, ఇద్ది పాపయ్య, ఉమాకవి, ఎం.ఉపేంద్రశర్మ, కె.సూర్యనారాయణ, కె.రంగనాయకులు, ఐఎస్‌డీ ప్రసాద్, సంతోష్‌కుమార్, టి.కృష్ణమూర్తిలు తమ కవితలను చదివి వినిపించారు.

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో ప్రత్యేక అధికారి ప్రమీల ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ రంగాలకు చెందిన తెలుగు భాషా నిపుణులు, పండితులు, కవులు, రచయితల చిత్రపటాలను ప్రదర్శించారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలో ఆస్తి గొడవల నేపథ్యంలో వదిన మైలపల్లి రాజేశ్వరిపై మరిది శేషగిరిరావు శుక్రవారం దాడి చేశాడు. పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ప్రత్యేక అభిషేకాలు



అమ్మవారికి హారతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు పూజలు నిర్వహించి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక అనఘాష్టమి వ్రతాలు



అనఘా సమేత దత్తాత్రేయ స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో అనఘా సమేత దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు, భక్తులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్నాయ్..!



జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు నిత్యం మొరాయిస్తున్నాయి. అరసవల్లి మిల్లు కూడలి, ఏడురోడ్ల కూడలి, దేఅండ్‌నైట్ కూడలి, రామలక్ష్మణ కూడలిలో ఎప్పటికప్పుడే మరమ్మతులకు గురవుతున్నాయి. శుక్రవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఇలాగే పనిచేయలేదు. దీంతో ఒత్తిడంతా సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌పై పడుతోంది. ఇదే విషయాన్ని ట్రాఫిక్ సీఐ నాగరాజు వద్ద ప్రస్తావించగా.. సిగ్నల్ లైట్ల మరమ్మతులు, బాగోగులు పురపాలక శాఖ చూసుకోవాల్సి ఉందన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్



అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో సిగ్నల్ లైట్లు వెలగని వైనం



దేఅండ్‌నైట్ కూడలి వద్ద పరిస్థితి

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న విష్ణుమూర్తినాయుడు

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తినాయుడు అన్నారు. మండలంలోని మద్రివలస, నాగులవలస, నడిమివలస గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెల్లో రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వజ్జిపర్తి రఘురాం, మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



పూజలందుకుంటున్న శివ లింగం



అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని అజ్జరాం గ్రామంలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. గోపూజతో సహా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోరా సాయిరాం రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలం, సర్పంచ్ సుగ్గు స్రవంతి, ఎంపీటీసీ బోర గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి అనుకొని కింతలిమిల్లు సమీపంలోని లక్ష్మాడిపేట గ్రామంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. యాగశాల అర్చన, కుంభావాహన, ధ్వజారోహణ, హోమాలు, తీర్థగోష్ఠి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం